చెరుకు రసంతో ఆరోగ్యానికి మేలు!

- కాలనీల్లో, మొబైల్ బండ్లపై విక్రయాలు
- ఎండ వేడిమి నుంచి ఉపశమనం

షాద్‌నగర్: ఒక్క గ్లాసు చెరుకు రసం తాగితే ఎంతో శక్తి వస్తుంది. వేసవి తీవ్రత నుంచి ఉపశమనం కల్గుతోంది. కల్తీలేని పానీయాలు సేవించేందుకు జనం ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. అలాంటి పానీయాల్లో చెరుకు రసానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. గతంలో ఎక్కడో ఓ చోట మాత్రమే చెరుకు రసం లభించేది ప్రస్తుతం గల్లీగల్లీకి వచ్చి విక్రయిస్తున్నారు. చెరుకు రసం తాగడం వల్ల అనేక లాభా లు ఉన్నాయి. పౌష్టిక విలువలతో కూడిన ఈ రసా న్ని తాగేందుకు చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు.

చెరుకు రసంతో చల్లదనం

మండే ఎండల్లో ఓగ్లాసు చల్లని చెరుకు రసం తాగితే హాయిగా అనిపిస్తుంది. క్షణాల్లో శరీరం ఉత్తేజితమవుతుంది. ఎండలు ఎక్కువగా ఉండడంతో కెమిల్స్‌తో తయారు చేసిన పానీయాల కంటే ప్రకృతి సిద్ధంగా లభించే చెరుకు రసాన్ని తాగేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. చెరుకు రసం కనిపించిందంటే చాలు ఇట్టే తాగేస్తున్నారు.

గల్లీగల్లీలో అమ్మకాలు

ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలు కుటుంబాలు షాద్‌నగర్ ప్రాంతానికి వలస వచ్చారు. సీజన్‌కు తగ్గ వ్యాపారులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే, ప్రత్యేకంగా మొబైల్ చెరుకు రసం బండ్లను తయారు చేసి పట్టణాల్లో, కాలనీల్లో ఉదయం ,సాయంత్రం వేళల్లో తిరుగుతూ గ్లాసు రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు. సుమారు లక్ష రూపాయల వ్యయంతో ప్రత్యేకంగా వాహనాలు తయారు చేయించుకున్నారు. దీంతో ఈ బండ్లకు ఆదరణ బాగా పెరిగింది.

ఉపయోగాలు

- చెరుకు రసం తాగడం వలన శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. తక్షణ శక్తినిస్తుంది.
- రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటుగా జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది.
- మూత్రపిండంలో రాళ్లను తొలగించడంతో పాటుగా, ఊపిరితిత్తుల క్యాన్సర్ రాకుండా అరికడుతుంది.
- చెరుకు రసంలో క్రోమియం, మెగ్నీషియం, జింక్ వంటి ఖనిజాలు అధికంగా ఉంటాయి. శరీరంలో గ్లూకోజ్ లెవన్స్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు కామెర్లు, ఇన్‌ఫెక్షన్లు రాకుండా నివారిస్తుంది.
- అలసటను తగ్గించి ఆయాసాన్ని దూరం చేస్తుంది.
- చెరుకు రసం తాగడం వల్ల పిల్లలలో తరచూ వచ్చే చిన్న చిన్న అనారోగ్య సమస్యలను నుంచి ఉపశమనం కలుగుతుంది.
- ప్రతి రోజు చెరుకు రసం తాగడం వల్ల శరీర బరువు క్రమేపి తగ్గుతుంది.



మొబైల్ చెరుకు రసం తయారీ వాహనం

కాలనీల్లో తిరుగుతూ అమ్ముతున్నాం



చెరుకు రసాన్ని అమ్మేందుకు గల్లీగల్లీ తిరుగుతున్నాం. వినియోగదారుల ముందే అప్పటికప్పుడు తయారు చేసి విక్రయిస్తున్నాం. చెరుకు రసాన్ని తయారు చేసేందుకు ప్రత్యేక వాహనాలను తయారు చేయించాం. ప్రతి గ్రామానికి వెళ్లి విక్రయిస్తున్నాం.

– రవి, చెరుకు రసం తయారీదారుడు, ఉత్తరప్రదేశ్

చాలా మంది ఇష్టపడుతున్నారు..



ఎలాంటి కల్తీ లేని పానీయం చెరుకు రసం. మార్కెట్‌లో చాలా కూల్ డ్రింక్స్‌లు అందుబాటులో ఉన్నాయి. కానీ, చెరుకు రసం తాగేందుకు ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. పౌష్టిక విలువలతో కూడిన చెరుకు రసం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే వేసవిలో ఎంతో డిమాండ్ ఉంటుంది.

– మకరాన్, చెరుకు రసం తయారీదారుడు, ఉత్తరప్రదేశ్

ఆర్టీసీ ఆదాయంపై దృష్టి పెట్టండి

సంస్థ రీజినల్ మేనేజర్ శ్రీదేవి



ఉద్యోగులకు కరపత్రాలను అందజేస్తున్న శ్రీదేవి

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికుల పట్ల మర్యాదగా మసులుకొని ఆదాయాన్ని పెంచుకోవచ్చని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి సూచించారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం ఉష ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులకు 'నా విధులలో నేను రాణిస్తాను' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి హాజరై మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రయాణికులకు మెరుగైన సేవలను అందిస్తూ ఆర్టీసీని లాభాల బాటలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని చెప్పారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సేవలను అందించాలని అన్నారు. సంస్థకు ప్రయాణికులే దేవుళ్లని ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలవైపు వెళ్లకుండా వారు కోరిన చోట బస్సును నిలపాలని సూచించారు. ఉద్యోగులు సమయ పాలన పాటిస్తూ బస్సులను నడపాలని, ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ముఖ్యకూడళ్లలో బస్సులను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని అన్నారు. ప్రయాణికులకు సరిపడా చిల్లర ఇచ్చి ఉత్తమ సేవలను అందిస్తూ వారి మన్ననలను పొందాలని అన్నారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులకు ఎంప్లాయి ఏజెంట్ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో సీఐ సుధాకర్, సీఆర్సీ వెంకటేష్, ఎస్‌డీఐ అర్జున్‌కుమార్, రాధాకృష్ణ, రాజేందర్, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

తిరుగులేని రాజకీయ శక్తిగా బీఆర్‌ఎస్

మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్



పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

చేవెళ్ల: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అతిపెద్ద పార్టీగా అవతరించిందని ఇప్పుడు దేశవ్యాప్తంగా పార్టీ విస్తరణ జరుగుతోందని మండల పార్టీ అధ్యక్షుడు పి. ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలపార్టీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 22ఏళ్లుగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని రాష్ట్రంలో తిరుగులేని రాజకీయపార్టీగా అవతరించిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పార్టీ అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చిందని తెలిపారు. గ్రామస్థాయి వరకు పార్టీ బలంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో మండలపార్టీ నాయకులు రామగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.నర్సింలు, ముడిమ్యాల సొసైటీ వైస్ చైర్మన్ మల్లేశ్, సర్పంచులు భీమయ్య, శ్రీనివాస్, మల్లారెడ్డి, నాయకులుఉన్నారు.

రాహుల్‌ను ఎదుర్కోలేకే సభ్యత్వం రద్దు



సత్యాగ్రహ దీక్షకు తరలుతున్న కాంగ్రెస్ శ్రేణులు

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోలేకే మోదీ ప్రభుత్వం రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేసిందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లిశంకర్ అన్నారు. రాహుల్ పార్లమెంట్ సభ్యత్వం రద్దును నిరసిస్తూ గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. ఈ దీక్షకు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయడం అప్రజాస్వామికమన్నారు. కేంద్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే దమ్ము లేకనే ఇలాంటి దిగజారుడు విధానాలకు పాల్పడుతుందని ఆరోపించారు. దేశంలో ప్రజల మధ్య మతచిచ్చు రేపుతూ దేశంలో అలజడులను సృష్టించేందుకు బిజెపి ప్రయత్నిస్తుందన్నారు. బిజెపి కుట్రలను తిప్పి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సత్యాగ్రహ దీక్షకు తరలిన వారిలో బాబర్‌అలీఖాన్, రఘు, పురుషోత్తంరెడ్డి, ఆందెమోహన్, నర్సింలు, ఆంజనేయులు, అశోక్, శేఖర్, మాధవులు, సీతారాములు తదితరులు ఉన్నారు.

గొర్ల కాపరుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

పశువైద్యాధికారి డాక్టర్ స్ఫూర్తి

కొత్తూరు: గొర్ల కాపరుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పశువైద్యాధికారిణి డాక్టర్ స్ఫూర్తి అన్నారు. గురువారం మండలంలోని మక్తగూడంలో గొర్ల కాపరుల సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్ఫూర్తి మాట్లాడుతూ.... గ్రామాల్లో కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని, ప్రోత్సాహకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ కాట్న రాజు, సంఘం అధ్యక్షుడు శ్రీను, సెక్రటరీ రాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ స్ఫూర్తి

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పంటను పరిశీలిస్తున్న రాములు

కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు రాములు

కేశంపేట: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కోడూరు రాములు అన్నారు. మండలంలోని వేములనర్వలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మామిడి, మొక్కజొన్న పంటలను గ్రామ కాంగ్రెస్, కిసాన్ సెల్ నాయకులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అకాల వర్షాలకు పంటలు నష్టపోయి రైతులు బాధపడుతుంటే బీఆర్‌ఎస్ నాయకులు ప్లీనరీల పేరుతో సంబురాలు చేసుకుంటున్నారని అన్నారు. ఆరు నెలలు కష్టపడి పండించిన పంటలు వర్షాలకు నీటి పాలైందని వాపోయారు. క్షేత్రస్థాయిలో పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సోషల్ మీడియా కన్వీనర్ వన్నాడ మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రాలకు విశేష ఆదరణ



చౌదరిగూడ మండలంలో అంబలి కేంద్రాలను పరిశీలిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

కొందుర్గు: పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామాల్లో పంపిణీ చేస్తున్న రాగి అంబలి కేంద్రాలకు విశేష ఆదరణ లభిస్తుందని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి తాపం నుంచి ప్రజలను కాపాడేందుకు షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 165 అంబలి కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అంబలిలో రాగులతో పాటు కొర్రలు, అండుకొర్రలు సజ్జలు తదితర చిరుధాన్యాలను కలుపుతున్నామని, వీటి ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

స్వరాజ్య సభను విజయవంతం చేయండి

డీఎస్పీ మండల కన్వీనర్ యాదగిరి

కొత్తూరు: బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్యాస్థాపనకు దళిత్ శక్తి ప్రోగ్రామ్ అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన పాదయాత్ర ముగింపు సభను విజయవంతం చేయాలని డీఎస్పీ మండల కన్వీనర్ యాదగిరి కోరారు. గురువారం యాదగిరి మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల రాజ్యాధికార స్థాపన కోసం విశారదన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాలో స్వరాజ్య పాదయాత్రను చేపట్టారని అన్నారు. 2022 మార్చి 15న నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో ప్రారంభమైన పాదయాత్ర ఇప్పటి వరకు మూడు వేల గ్రామాల మీదుగా కొనసాగిందని అన్నారు. గ్రామ గ్రామాన ప్రజలను చైతన్య పరుస్తూ యాత్ర కొనసాగుతోందని చెప్పారు. ముగింపు సభ ఏప్రిల్ 30న హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ప్రజాస్వామ్య వాదులందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో

ముగింపు సభను విజయవంతం చేద్దాం

కొందుర్గు: దళిత శక్తి ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో విశారదన్ మహారాజ్ చేపట్టిన పదివేల కిలోమీటర్ల పాదయాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 30న హైదరాబాద్ ఎల్‌బినగర్ ఇండోర్ స్టేడియంలో బహిరంగ సభ ఉంటుందని డీఎస్పీ రాష్ట్ర నాయకులు భిక్షపతి అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ముగింపు సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, నరసింహ, చెన్నయ్య, రవి, కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం..

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గొల్ల బస్తీవాసులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పనులు చేస్తున్నామన్నారు. గొల్లబస్తీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల పనులు చేపడతామని చెప్పారు. జెడ్పీ చైర్మన్ అనితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యల సహకారంతో రోడ్డు పనులు పూర్తి చేస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకొచ్చి మండలంలోని అన్ని గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో షాబాద్ మాజీ సర్పంచ్ వెంకట్‌యాదవ్, గ్రామస్తులు తదితరులున్నారు.



గొల్లబస్తీ వాసులతో మాట్లాడుతున్న అవినాశ్‌రెడ్డి

మా సమస్యలు పరిష్కరించండి



మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న వీఓఏలు

చేవెళ్ల: వీఓఏల సమస్యలపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని వీఓఏల సంఘం సభ్యులు కోరారు. మండల కేంద్రంలో మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట గురువారం మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తలుచుకుంటే మా సమస్యలను పరిష్కరించడం పెద్ద సమస్య కాదన్నారు. తాము ఎన్నో ఏళ్లుగా గ్రామాల్లో మహిళా సంఘాలతో పని చేస్తున్నామని చెప్పారు. పెరిగిన నిత్యావసర ధరలతో కనీస వేతనం లేక చాలీచాలని జీతాలతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, బీమా, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమ్మెలో మండల వీఓఏలు వినోద్, విజయ, స్వప్న, శ్రీను, రాణి, స్వరూప, శేఖర్, జ్యోతి, అనిత, కవిత, సుజాత, సల్మా, విజయ పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదలకు ప్రయోజనం



అద్దాలు పంపిణీ చేస్తున్న నవనీత

సర్పంచ్ నవనీత

మొయినాబాద్‌రూరల్: అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎత్‌మార్‌పల్లి సర్పంచ్ గుండాల నవనీత అన్నారు. గురువారం మండలంలోని ఎత్‌మార్‌పల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నవనీత మాట్లాడుతూ.. ప్రాథమిక దశలో కంటి జబ్బులను గుర్తించి సకాలంలో చికిత్స చేసుకుంటే దృష్టి సమస్యల నుంచి బయటపడవచ్చున్నారు. వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కంటి వెలుగు వైద్యురాలు సుష్మ, చైతన్య, డీఈఓ అబ్దుల్ ఖయూమ్, ఏఎన్‌ఎంలు జ్ఞానేశ్వరి, గంగమ్మ, ఆశవర్కర్లు యాదమ్మ, మంజుల, కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధికి నిరంతర కృషి

ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: మండలంలోని గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని చందిప్పలో హెచ్‌ఎండీఏ నిధులు రూ. 10లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న శంకర్

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్దలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణానికి గురువారం గ్రామానికి చెందిన గండ్ల శంకర్ రూ 21వేల నగదును విరాళం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాలలో కనుమరుగువుతున్న పురాతన దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ప్రతిఒక్కరు ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకొని భగవన్నామస్మరణ చేయాలని అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్ గుప్త, వెంకటయ్య, అంజయ్య, యాదయ్య, శ్రీను, యాదయ్య పాల్గొన్నారు.

పౌల్ట్రీ ఫెడరేషన్ సహాయ కార్యదర్శిగా వెంకట్‌రావు



షాద్‌నగర్: తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా షాద్‌నగర్‌కు చెందిన పౌల్ట్రీ వ్యాపారి పాతూరి వెంకట్‌రావు ఎన్నికయ్యారు. గురువారం జరిగిన సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. వెంకట్‌రావు ఎన్నిక కావడం పట్ల పలువురు ఆయనను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పౌల్ట్రీ రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

అర్హులకు సబ్సిడీ గొర్రెలు

పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి



మాట్లాడుతున్న పశువైద్యాధికారి స్రవంతి

షాబాద్: గ్రామాల్లో అర్హులైన గొల్ల, కురుమలకు సబ్సిడీ గొర్రెలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మండల పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగర్‌కుంట, ఎల్గొండగూడ, చర్లగూడ గ్రామాల్లో గొల్ల, కురుమ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. మొదటి విడతలో మిగిలిన లబ్ధిదారులందరికీ రెండో విడతలో గొర్రెలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ, గొల్ల, కురుమ సంఘం నాయకులు ఉన్నారు.

బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో చేసిందేమీ లేదు



కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

కొందుర్గు: బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీలేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య విమర్శించారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జంగయ్య హాజరై మాట్లాడారు. ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసి మోదీ అధికారంలోకి వచ్చాడన్నారు. జన్‌ధన్ ఖాతాలు తెరిస్తే దేశంలో నల్లధనాన్ని వెలికితీసి ఒక్కొక్కరి ఖాతాలో రూ. 15 లక్షలు జమ చేస్తామని నమ్మించాడన్నారు. నల్ల చట్టాలను తీసుకొచ్చి నిరుపేదల నడ్డి విరిచాడన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్, నాయకులు మంజుల, చిన్న, లింగం, అనంత, సునీత, బాలమ్మ, రాములమ్మ, నర్సమ్మ పాల్గొన్నారు.